క్లుప్తంగా

24 నుంచి అమ్మవార్ల జాతర

బుట్టాయగూడెం: ఈనెల 24 నుంచి 28వ తేదీ వరకు దుర్గమ్మ, గుబ్బల మంగమ్మ, నాగ దుర్గమ్మతల్లి, గద్దెరాజుల జాతర మహోత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయ పీఠాధిపతి వర్స పుల్లారావు తెలిపారు. బుధవారం మండలంలోని దుద్దుకూరులో జాతర ఆహ్వాన పత్రికను ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, వైఎస్సార్ సీపీ నియోజకవర్గ సమన్వయకర్త తెల్లం రాజ్యలక్ష్మిలకు ఆయన అందజేశారు. జాతర మహోత్సవాలకు వచ్చి అమ్మవారి ఆశీస్సులు పొందాలని కోరారు. అలాగే ఐటీడీఏ ఏపీవో పీవీఎస్ నాయుడుకు కూడా పత్రిక అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ మాఘశుద్ధ పౌర్ణమి రోజున ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని ప్రతి రోజూ అన్నసమారాధన కార్యక్రమం కూడా నిర్వహిస్తామని చెప్పారు. భక్తులు పాల్గొని జయప్రదం చేయాలని ఆయన కోరారు.

29లోగా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలి

జంగారెడ్డిగూడెం: రాష్ట్ర ప్రభుత్వ పింఛన్‌దారులు లైఫ్ సర్టిఫికెట్‌ను ఈనెల 29వ తేదీలోగా సబ్ ట్రెజరీ కార్యాలయంలో సమర్పించాలని జంగారెడ్డిగూడెం సబ్ ట్రెజరీ ఆఫీసర్ కంచర్ల చంద్రయ్య తెలిపారు. పింఛన్‌దారులు నేరుగా లేదా ఈ సేవా కేంద్రాల్లో ఆన్‌లైన్ ద్వారా లైఫ్ సర్టిఫికెట్లు సమర్పించాలన్నారు. లేకుంటే పెన్షన్ నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. పింఛన్‌దారుడు పెన్షన్ బుక్, ఆధార్ కార్డు వెంట తీసుకురావాల్సిందిగా సూచించారు.

పరిసరాల పరిశుభ్రతకు అధిక ప్రాధాన్యం

టి.నరసాపురం: పరిసరాల పరిశుభ్రతకు ప్రభుత్వం అధిక ప్రాధాన్యతనిస్తోందని జెడ్పీటీసీ సామంతపూడి బాల సూర్యనారాయణ రాజు తెలిపారు. బుధవారం టి.నరసాపురం ఎంపీడీవో కార్యాలయంలో డస్ట్‌బిన్‌లను ఆయన పంపిణీ చేశారు. స్వచ్ఛ భారత్‌లో భాగంగా ప్రతి ఇంటి వద్ద తడి, పొడి చెత్త విడివిడిగా సేకరించేందుకు రెండు వేర్వేరు రంగులు గల ప్లాస్టిక్ చెత్త బుట్టలను ప్రభుత్వ సమకూర్చిందని వివరించారు. మండలంలోని 20,330 కుటుంబాలకు డస్ట్‌బిన్‌ల పంపిణీ కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపీపీ దారబోయిన లక్ష్మీ వెంకటేశ్వరరావు, ఎంపీడీవో కె.జోగేశ్వరరావు, నాయకులు బోంతు అంజిబాబు, దాకారపు సూరిబాబు, బోళ్ళ రంగారావు, బొడ్డు శ్రీను, సర్పంచ్ సునంద, ఎంపీటీసీ నార్లపాటి వెంకట్రావు తదితరులు పాల్గొన్నారు.

జల్ జీవన్ మిషన్ పథకంలో కుళాయి కనెక్షన్‌లు

చింతలపూడి: జల్ జీవన్ మిషన్ పథకం ద్వారా గ్రామీణ ప్రాంతాల్లో నివసించే ప్రజలకు కుళాయిల ద్వారా స్వచ్ఛమైన తాగునీరు అందించడమే ప్రభుత్వ లక్ష్యమని ఎంపీపీ డాక్టర్ బి.రాంబాబు నాయక్ తెలిపారు. స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో బుధవారం జల్ జీవన్ మిషన్, హౌసింగ్ శాఖపై ఇంజనీరింగ్ అసిస్టెంట్లు, ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు, గృహనిర్మాణ శాఖ అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ చిన్న రాట్నాలు మాట్లాడుతూ ప్రస్తుతం మండలంలోని అన్ని గ్రామాల్లో వలంటీర్లు ప్రతి గృహాన్ని సర్వే చేస్తున్నారని చెప్పారు. ఏ గృహానికి కుళాయి కనెక్షన్ ఉంది, ఎవరికి కుళాయి కనెక్షన్ లేదు అన్న వివరాలను సర్వేలో పొందుపరుస్తున్నారని తెలిపారు. ఇంత వరకు కుళాయి కనెక్షన్ లేని గృహాలను గుర్తించి గ్రామీణ నీటి సరఫరా విభాగం ద్వారా కుళాయి కనెక్షన్ అందిస్తామని చెప్పారు. అదే విధంగా త్వరలో ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చే అవకాశం ఉన్నందున పెండింగ్‌లో ఉన్న గృహాలను పూర్తిచేసేలా లబ్ధిదారులకు బిల్లులు చెల్లించడానికి చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. పెండింగ్ బిల్లులు లేకుండా క్లియర్ చేయాలని సూచించారు. సమావేశంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఫణికుమార్, హౌసింగ్ ఏఈ రవికిరణ్ తదితరులు పాల్గొన్నారు.

సీసీ రోడ్డు ప్రారంభం

జంగారెడ్డిగూడెం రూరల్: అభివృద్ధే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తోందని జెడ్పీటీసీ పోల్నాటి బాబ్జి అన్నారు. మండలంలోని వేగవరంలో జిల్లా పరిషత్ నిధులు రూ.6 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్డును ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో సర్పంచ్ లక్కాబత్తుల నాగరాజు, వైఎస్సార్ సీపీ నాయకులు నులకాని సూర్య చంద్రరావు, రాఘవరాజు ఆదివిష్ణు, చిట్యాల చంద్రరావు, యాదాల ధర్మరాజు, మల్నీడి బాబి, మోటేపల్లి విజయ్ తదితరులు పాల్గొన్నారు.

గోదావరి నదిలో చేప పిల్లలు విడుదల

పోలవరం రూరల్: గోదావరి నదిలో మత్స్యకారులు చిన్న చేప పిల్లలను వేట చేయరాదని జిల్లా మత్స్యశాఖాధికారి నాగ లింగాచార్యులు అన్నారు. మండలంలోని పోలవరం, గూటాల గ్రామాల్లో సుమారు 60 లక్షల విలువ గల చేప పిల్లలను బుధవారం నదిలో విడుదల చేశారు. ఎంపీపీ సుంకర వెంకటరెడ్డి రూ.21.10 లక్షల చేప పిల్లలను అధికారులతో కలిసి నదిలో వేశారు. మత్స్య సంపద పెరగాలంటే చిన్న చేప పిల్లలను వేట చేయరాదన్నారు. రాబోయే రోజుల్లో మత్స్య సంపద పెరిగితే మత్స్యకారుల ఆర్థికాభివృద్ధి మరింత పెరుగుతుందన్నారు. మత్స్యశాఖ అసిస్టెంట్ డైరెక్టర్ బి.నరసయ్య, ఎఫ్‌డీవో వెంకటేశ్వరరావు, దివ్య, తదితరులు పాల్గొన్నారు.

మహిళా సాధికారతే సీఎం జగన్ లక్ష్యం

వైఎస్సార్ సీపీ చింతలపూడి కన్వీనర్ కంభం విజయరాజు


సీఎం జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న వైఎస్సార్ సీపీ నేతలు, తదితరులు

జంగారెడ్డిగూడెం: మహిళా సాధికారతే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు తెలిపారు. బుధవారం స్థానిక ఎంబీ సోషల్ క్లబ్ ఆవరణలో జరిగిన జంగారెడ్డిగూడెం మండల స్థాయి వైఎస్సార్ ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. ఎక్కడైతే మహిళలు గౌరవించబడతారో ఆ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని భావించిన సీఎం జగన్ వారి సంక్షేమం కోసం పథకాలను అమలు చేస్తున్నారన్నారు. రాష్ట్రం ఆర్థికంగా కష్టాల్లో ఉన్నప్పటికీ అభివృద్ధి, సంక్షేమ పథకాలు అమలు చేయడంలో వెనుకాడలేదన్నారు. నేనున్నానంటూ రాష్ట్ర ప్రజలకు భరోసా ఇచ్చారన్నారు. పరిపాలనా వ్యవస్థను సమూలంగా మార్పు చేసి ఇంటి వద్దకే సేవలను తీసుకువచ్చారన్నారు. వలంటీర్ల సేవలు అద్భుతం అన్నారు. రాష్ట్రంలో అమలవుతున్న పథకాలు, అభివృద్ధి ఇతర రాష్ట్రాలకు ఆదర్శవంతం అయ్యిందన్నారు. ఈ నేపథ్యంలో జగనన్నను మళ్లీ సీఎంగా గెలిపించుకోవాలని పిలుపునిచ్చారు. జగనన్న ఎన్నికల యుద్ధానికి సిద్ధం అని శంఖారావం పూరించారని అన్నారు. ప్రతిపక్షాలు అన్నీ ఏకమైనా మళ్లీ జగనన్నే సీఎం అన్నారు. జగనన్న అభిమన్యుడు కాదని, అర్జునుడని తెలిపారు.

సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లు

జెడ్పీటీసీ, వైఎస్సార్ సీపీ ప్రచార కమిటీ జిల్లా అధ్యక్షుడు పోల్నాటి బాబ్జి మాట్లాడుతూ సంక్షేమం, అభివృద్ధి రెండు కళ్లుగా భావించి జగనన్న రాష్ట్రాన్ని అభివృద్ధి చేస్తున్నారన్నారు. మహానేత వైఎస్సార్ కన్నా ఒక అడుగు ముందుకు వేసి పరిపాలనను ఇంటికే తెచ్చారన్నారు. చంద్రబాబు నాయుడు రుణమాఫీ అని డ్వాక్రా మహిళలను మోసం చేశారన్నారు. కానీ జగనన్న మాత్రం ఇచ్చిన మాటకు కట్టుబడి మడమ తిప్పకుండా డ్వాక్రా మహిళలకు ఇచ్చిన రుణాలు మాఫీ చేశారన్నారు. పేదవాడికి ఉచితంగా వైద్యం అందిస్తున్నారన్నారు. వలంటీర్ల వ్యవస్థ అద్భుతంగా పనిచేస్తోందన్నారు. నేను సైతం అంటూ ప్రతి ఒక్కరూ ముందుకు వచ్చి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిని సీఎంను చేసే బాధ్యత తీసుకోవాలని పిలుపునిచ్చారు.

సంబరాలు చేసుకునే రోజు

డ్వాక్రా మహిళలంతా సంబరాలు చేసుకునే రోజు ఆసరా కార్యక్రమమని ఎంపీపీ కొదమ జ్యోతి అన్నారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన రుణమాఫీ హామీని నెరవేర్చారన్నారు. రాష్ట్రంలో ప్రతి కుటుంబాన్ని ఆదుకుంటున్నారన్నారు. మహిళలంతా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి రుణపడి ఉన్నామని, పేదవాడి సొంతింటి కల నెరవేర్చారన్నారు. ప్రతి ఇంటికి నేరుగా పింఛన్, రేషన్ అందిస్తున్నారన్నారు. మళ్లీ ఈ పథకాలన్నీ అమలు కావాలంటే జగనన్నను సీఎం చేసుకోవాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు వామిశెట్టి హరిబాబు, ఏఎంసీ చైర్‌పర్సన్ జగ్గవరపు జానకిరెడ్డి, ఉభయగోదావరి జిల్లాల బూత్ కమిటీ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, నియోజకవర్గ బూత్ కమిటీ కో–ఆర్డినేటర్ రాఘవరాజు ఆదివిష్ణు, మున్సిపల్ వైస్ చైర్‌పర్సన్ ముప్పిడి అంజి, జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, మల్నీడి బాబి, మేడవరపు విద్యాసాగర్, పంతగాని వెంకన్న, ఎంపీడీవో విజయ ప్రసాద్, ఏసీ సుబ్బారావు, ఏపీఎం ఝాన్సీ, సర్పంచ్‌లు, ఎంపీటీసీలు తదితరులు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే లక్ష్యంగా పాలన


కుక్కునూరులో ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళలు

కుక్కునూరు: మహిళలు, పేద ప్రజల సంక్షేమమే లక్ష్యంగా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన సాగిస్తున్నారని వైఎస్సార్ సీపీ పోలవరం నియోజకవర్గ ఇన్‌చార్జ్ తెల్లం రాజ్యలక్ష్మి, ఏలూరు పార్లమెంటరీ ఇన్‌చార్జ్ కారుమూరి సునీల్ కుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం కుక్కునూరులో జరిగిన వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వారు హాజరై మాట్లాడారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన మాట ప్రకారం నాల్గో విడతగా కుక్కునూరు మండలంలో 794 స్వయం సహాయక సంఘాలకు రూ.4.98 కోట్లు నగదును ఖాతాల్లో జమ చేస్తున్నట్టు చెప్పారు. గత ప్రభుత్వ హయాంలో చంద్రబాబు రుణమాఫీ చేస్తానని చెప్పి ఎన్నికల ముందు రూ.10 వేలు ఇచ్చి చేతులు దులుపుకున్నారని విమర్శించారు. జగనన్న ప్రజా సంకల్ప యాత్రలో డ్వాక్రా మహిళల కష్టాలు తెలుసుకుని వారికి రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చారన్నారు. ఎన్ని ఇబ్బందులెదురైనా అక్కచెల్లెమ్మల కోసం ప్రతి హామీని నిలబెట్టుకున్నారని కొనియాడారు. రాష్ట్రంలోని పేద ప్రజల జీవన ప్రమాణాలు మెరుగుపరిచేందుకు జగనన్న 124 సార్లు బటన్ నొక్కి నేరుగా ప్రజల ఖాతాల్లోకి డబ్బును జమ చేశారన్నారు. గత ప్రభుత్వంలో నేరుగా ప్రజల ఖాతాల్లోకి ఇలా డబ్బులు ఎప్పుడైనా జమ చేశారా అని ప్రశ్నించారు. గత ప్రభుత్వ హయాంలో జన్మభూమి కమిటీలు, నీరు–చెట్టు పేరుతో ప్రజలకు అందాల్సిన డబ్బులను పార్టీ నాయకుల ఖాతాల్లోకి తరలించి సొమ్ము చేసుకున్నారన్నారు. ప్రజలకు ఇంత చేసిన జగనన్న కోసం ప్రజలు వచ్చే ఎన్నికల్లో ఎంఎల్‌ఏ, ఎంపీ స్థానాలకు ఫ్యాన్ గుర్తుపై బటన్‌లు నొక్కి తమను గెలిపించాలని కోరారు. అంతేకాక విలీన మండలాల సమస్యలను పరిష్కరించే దిశగా తామిద్దరం కృషి చేస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో తహసీల్దార్ అచ్యుతా కుమారి, ఇన్‌చార్జ్ ఎంపీడీఓ నరసింహారావు, ఏపీడీ ఎం.నాగేశ్వరరావు, వెలుగు ఏపీఎం జి.భానుమతి, వైఎస్సార్ సీపీ మండలాధ్యక్షుడు కుచ్చర్లపాటి నరసింహరాజు, ఎంపీపీ చేబ్రోలు గీతావాణి, గాండ్ల తెలికల సంఘం స్టేట్ డైరెక్టర్ సర్వా శ్రీదేవి, వైస్ ఎంపీపీ గాడిద రామచంద్రం, ఏఎంసీ డైరెక్టర్ మాదిరాజు వెంకన్నబాబు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కో ఆప్షన్ సభ్యుడు షేక్ సలీం, వైఎస్సార్ సీపీ యూత్ కన్వీనర్ రాయి రవి, మండల మహిళా అధ్యక్షురాలు వేల్పుల తిరుపతమ్మ, నాయకులు, కార్యకర్తలు, మహిళా సంఘం సభ్యులు పాల్గొన్నారు.

జగనన్న మేలును మరువలేం



చంద్రబాబు గతంలో డ్వాక్రా రుణాలు మాఫీ చేస్తానని చెప్పి మహిళలను మోసం చేశాడు. మా బాధలు అర్థం చేసుకున్న జగనన్న రుణమాఫీ చేస్తానని హామీ ఇచ్చి, ఇచ్చిన మాటను నిలబెట్టుకున్నాడు. ఆయన చేసిన మేలును మరవలేం. మరలా ఆయననే ముఖ్యమంత్రిగా గెలిపించుకుంటాం.

– ఆర్.సుశీల, కుక్కునూరు

మహిళా పక్షపాతి జగనన్న



డ్వాక్రా సంఘాలకు నాలుగు విడతలుగా ఆసరా డబ్బులు అందించి జగనన్న మహిళా పక్షపాతిగా నిలిచారు. మాకు అండగా నిలిచిన జగనన్నకు రాబోయే ఎన్నికల్లో మహిళలందరం అండగా నిలిచి మరలా ముఖ్యమంత్రిగా ఆయననే గెలిపించి చూపిస్తాం.

– కొండపల్లి నాగమణి, బెస్తగూడెం

జగనన్న పాలనలో మహిళలకు పెద్దపీట


ఆసరా చెక్కుల పంపిణీ కార్యక్రమానికి హాజరైన మహిళలు

కామవరపుకోట: మహిళలు ఆర్థిక, సామాజికంగా అన్ని రంగాల్లో రాణించాలనే లక్ష్యంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి వారి సమగ్రాభివృద్ధి, సాధికారతకు పెద్దపీట వేశారని వైఎస్సార్ సీపీ ఏలూరు పార్లమెంటరీ సమన్వయకర్త కారుమూరి సునీల్ కుమార్, చింతలపూడి నియోజకవర్గ సమన్వయకర్త కంభం విజయరాజు తెలిపారు. బుధవారం స్థానిక చినరాజప్ప ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో వైఎస్సార్ ఆసరా నాల్గో విడత చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. గత టీడీపీ పాలనలో పసుపు, కుంకుమ పేరుతో మహిళా సంఘాలను దగా చేశారన్నారు. దీంతో మహిళలు ఆర్థికంగా నలిగిపోయి అప్పులు పాలయ్యారన్నారు. కానీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పరిపాలన చేపట్టినప్పటి నుంచి మహిళలకు అన్ని రంగాలలో సమాన హక్కులు కల్పిస్తూ, మహిళల ప్రతి అడుగులో అండగా ఉన్నారన్నారు. నవరత్నాలు ద్వారా ప్రతి పథకం మహిళా అభ్యున్నతికి ప్రవేశపెట్టినదేనన్నారు. ప్రతి ఇంటిలో మహిళలకు ప్రాధాన్యత పెరగడానికి ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలే ఒక కారణం అన్నారు. మహిళలకు అన్ని స్థాయిలలో మేలు చేస్తున్నాం కాబట్టే రాష్ట్రంలోని మహిళలు సంతోషంగా ఉన్నారన్నారు. ప్రధానంగా అక్కచెల్లెమ్మలకు వైఎస్సార్ ఆసరా, చేయూత, కాపు నేస్తం వంటి పథకాలు ద్వారా తోడ్పాటును అందిస్తున్నారన్నారు. టీడీపీ నాయకుల మాయమాటలు నమ్మొద్దు అని, వైఎస్సార్ సీపీ పార్టీని మరలా గెలిపించాలని కోరారు. విద్యతోనే తలరాతలు మారతాయని బలంగా విశ్వసించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి అమ్మఒడి ద్వారా ప్రతి ఏటా రూ.15 వేలు ఆర్థిక సాయం, జగనన్న గోరుముద్ద ద్వారా పౌష్టికాహారం అందిస్తూ, 9 రకాల వస్తువులతో కూడిన జగనన్న విద్యా కానుక కిట్, జగనన్న విద్యా దీవెన ద్వారా పూర్తి ఫీజు రీయింబర్స్‌మెంట్, భోజన వసతి ఖర్చుల కోసం వసతి దీవెన వంటి పథకాలను విద్యారంగంలో చేస్తూ పేద విద్యార్థుల బంగారు భవిష్యత్‌కు బాటలు వేస్తున్నారన్నారు. ఈ సంక్షేమ పథకాలన్నీ మరలా మీ ఇంటికి చేరాలంటే ప్రతి ఒక్కరూ వైఎస్సార్ సీపీ పార్టీని గెలిపించి, సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని మరలా ముఖ్యమంత్రిగా చేయాలని కోరారు. చింతలపూడి నియోజకవర్గంలో వైఎస్సార్ ఆసరా నాలుగు విడతల్లో 5,962 మహిళా గ్రూపులకు గానూ రూ.265.62 కోట్లు మహిళల ఖాతాలో జమైనట్లు తెలిపారు. కామవరపుకోట మండలం పరిధిలో 1,290 మహిళా సంఘాలకు గానూ రూ. 15,53,20,645లు జమ చేస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ కడిమి రమేష్, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ రమేష్‌బాబు, చింతలపూడి ఏఎంసీ చైర్మన్ జానకిరెడ్డి, మాజీ చైర్మన్ మేడవరపు అశోక్ శ్రీనివాస్, మద్ది ఆంజనేయస్వామి దేవస్థానం చైర్మన్ కేసరి సరితారెడ్డి, సొసైటీ చైర్మన్ సాయినా కనకరాజు, రాష్ట్ర ముదిరాజ్ సంఘ డైరెక్టర్ చిక్కుల శ్రీను, సర్పంచులు కరిపోతు అనూష, చొక్కా స్వర్ణ, దేవరపల్లి రామ్మోహన్‌రావు, గుండుగోలు సుబ్బారావు, ఉప సర్పంచ్ మేడూరు రంగబాబు, ఎంపీటీసీ మేడంకి పద్మ, డాక్టర్ రామకృష్ణ, షేక్ మీరా సాహెబ్, సాయిల స్వాతి, ఎంపీడీవో జె.స్వర్ణ భారతి, మహిళా మండలి ఏసీ ఎస్వీ రామోజీ, ఏపీఎం జ్యోతి, డీపీఎం సీహెచ్ సుబ్బారావు, సీసీలు నారాయణ, సత్యం బాబు, మహిళా మండలి సభ్యులు పాల్గొన్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం


మాట్లాడుతున్న వైఎస్సార్ సీపీ చింతలపూడి కన్వీనర్ కంభం విజయరాజు

జంగారెడ్డిగూడెం: జగనన్న ఆరోగ్య సురక్ష పథకం ద్వారా సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పేదలకు మెరుగైన వైద్యం అందిస్తున్నారని వైఎస్సార్ సీపీ చింతలపూడి నియోజకవర్గ కన్వీనర్ కంభం విజయరాజు అన్నారు. బుధవారం స్థానిక ఆర్యవైశ్య కళ్యాణ మండపంలో గౌరీశంకరపురం సచివాలయం పరిధిలో జరిగిన జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. ఆరోగ్య శ్రీ పథకాన్ని మహానేత వైఎస్సార్ తీసుకువస్తే ఆ పథకాన్ని మించి సీఎం జగన్ ప్రతి ఇంటికి వైద్యం అందిస్తున్నారని, ఆరోగ్య శ్రీలో రూ.25 లక్షలు వరకు ఉచితంగా కార్పొరేట్ వైద్యం అందిస్తున్నారన్నారు. మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి మాట్లాడుతూ అందరికీ వైద్యాన్ని అందుబాటులోకి తెచ్చిన ఘనత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిదేనన్నారు. 3వేల పైచిలుకు వ్యాధులకు ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్స అందిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వైస్ చైర్మన్ ముప్పిడి అంజి, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్చిరాజు, పార్టీ జిల్లా మహిళా విభాగం అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, ఉభయ గోదావరి జిల్లాల బూత్ కమిటీ కో–ఆర్డినేటర్ బీవీఆర్ చౌదరి, మేడవరపు విద్యాసాగర్, బత్తిన చిన్నా, కఠారి సీతారాంబాబు, షేక్ అక్బర్, గూడపాటి రాధాకృష్ణ, గెద్దాడ శ్రీనివాసరావు, చిప్పాడ వెంకన్న, షేక్ అమీర్, కాసర సురేష్ రెడ్డి, ఎం.మురళి, వాసా రామకృష్ణ, దున్నం బుజ్జి, తల్లాడ సంజయ్, కంచర్ల విష్ణు, ఆదివిష్ణు, ఉగ్గం ప్రసాద్, తెల్లం వెంకటేశ్వరరావు, మున్సిపల్ మేనేజర్ కేవీ రమణ తదితరులు పాల్గొన్నారు.

సీసీ డ్రెయిన్ నిర్మాణానికి శంకుస్థాపన


శంకుస్థాపన చేస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని 11వ వార్డు లక్ష్మీగణపతి టౌన్‌షిప్‌లో బుధవారం సీసీ డ్రెయిన్ నిర్మాణానికి మున్సిపల్ చైర్‌పర్సన్ బత్తిన లక్ష్మి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ జంగారెడ్డిగూడెంలో కౌన్సిల్ సహకారంతో మౌలిక వసతుల కల్పనకు కృషి చేస్తున్నట్లు తెలిపారు. రానున్న రెండు సంవత్సరాల్లో మరిన్ని అభివృద్ధి కార్యక్రమాలు చేపడ్తామన్నారు. పట్టణాభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్నామని తెలిపారు. 11వ వార్డులో ఇప్పటి వరకు రూ.కోటి మేర అభివృద్ధి పనులు చేసినట్లు చెప్పారు. 11వ వార్డులోని లక్ష్మీగణపతి టౌన్‌షిప్ ప్రాంతంలో రూ.16 లక్షలతో 200 మీటర్ల సీసీ డ్రెయిన్‌ను నిర్మిస్తున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో వార్డు కౌన్సిలర్ ఉగ్గం దుర్గాప్రసాద్, వైస్ చైర్మన్ ముప్పిడి వీరాంజనేయులు, వైఎస్సార్ సీపీ పట్టణాధ్యక్షుడు చిటికెల అచ్యుతరామయ్య, కౌన్సిలర్ సంకు సురేష్, పార్టీ సీనియర్ నాయకులు చిప్పాడ వెంకన్న, గెద్దాడ శ్రీను, ఆర్ఎంబీ విభాగ అధ్యక్షుడు కటారి రాంబాబు, తల్లాడ సంజయ్, గుబ్బల అబ్బాస్, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.

గిరిజన దర్బార్‌లో వినతుల స్వీకరణ

బుట్టాయగూడెం: మండలంలోని కేఆర్ పురం ఐటీడీఏలో జరిగిన గిరిజన దర్బార్‌లో పీఓ పీవీఎస్ నాయుడు దరఖాస్తులను స్వీకరించారు. ఐటీడీఏ పరిధిలోని గిరిజన మండలాలకు చెందిన పలువురు సమస్యలపై వినతి పత్రాలు అందజేశారు. పోలవరం మండలం చేగొండపల్లికి చెందిన పర్శిక బోడిదొర వినతి పత్రాన్ని అందజేశారు. పోలవరం మండలం టేకూరుకు చెందిన మేడే కృష్ణస్వామి ఆర్‌అండ్‌ఆర్‌లో సర్వే చేసి పట్టాలు ఇప్పించాలని కోరారు. బుట్టాయగూడెం మండలం అంతర్వేదిగూడెంకు చెందిన తాతి రత్నకుమారి తాను జీఎస్ఎంగా పనిచేస్తున్నానని, పెండింగ్‌లో ఉన్న 6 నెలల జీతం ఇప్పించాలని కోరుతూ వినతి పత్రం అందజేశారు. పోలవరం మండలం కొమ్ముగూడెంకు చెందిన మడకం ముత్యాలమ్మ తనను ఆశా వర్కర్‌గా నియమించాలని కోరారు. వేలేరుపాడు మండలం మోదేలుకు చెందిన కెచ్చెల ముక్కారెడ్డితో పాటు కొందరు గిరిజనులు తమ గ్రామంలో గృహ నిర్మాణాలకు అవకాశం కల్పించాలని వినతి పత్రం అందించారు. బుట్టాయగూడెం మండలం పందిరిమామిడిగూడెంకు చెందిన కొప్పిశెట్టి వెంకటరెడ్డి తనకు ఉపాధి కల్పించాలని కోరారు. బొల్లి మాధవరెడ్డి ఉపాధి కోసం వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో వివిధ శాఖలకు చెందిన అధికారులు పాల్గొన్నారు.

దాబాలో యువకుల గొడవ

జంగారెడ్డిగూడెం: దాబాలో ఆహార పదార్థాలు సరిగా లేవంటూ యువకులు గొడవ చేసి యజమాని, సిబ్బందిపై దాడి చేశారు. స్థానికులు, బాధితులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. అశ్వారావుపేట రోడ్డులోని విద్యుత్ సబ్‌స్టేషన్ ఎదురుగా ఉన్న దాబాకు మంగళవారం రాత్రి కొందరు యువకులు వెళ్లారు. ఆహారాన్ని ఆర్డర్ చేసిన వారు.. ఆ పదార్థాలు సరిగా లేవంటూ దాబా సిబ్బందితో ఘర్షణ పడ్డారు. వారు సర్దిచెప్పడంతో అక్కడి నుంచి వెళ్లిపోయిన వారు బుధవారం కొంతమంది యువకులతో కలిసి తిరిగి వచ్చి దాబాలో గొడవ చేశారు. దాబాలోని సామాగ్రిని ధ్వంసం చేయడంతో పాటు అడ్డుకోబోయిన యజమాని మహిపాల్, సందీప్‌లను కొట్టారు. ద్విచక్ర వాహనాన్ని వారిపై ఎక్కించేందుకు యువకులు ప్రయత్నించడంతో స్థానికులు అడ్డుకున్నారు. ఈ నేపథ్యంలో దాబాలో ఉన్న కౌంటర్‌లోని నగదు పట్టుకుపోయారని యజమాని ఆరోపిస్తున్నాడు. అయితే పాత కొట్లాట కేసుకు సంబంధించి ఈ గొడవ జరిగినట్లుగా పలువురు భావిస్తున్నారు. ఘటనకు సంబంధించి ఇరువర్గాలు తమపై దాడి చేశారంటూ స్థానిక ఏరియా ఆసుపత్రిలో చేరినట్లు సమాచారం.

క్రైస్తవుల దీక్షలు ప్రారంభం

కామవరపుకోట: మండలంలోని కొత్తూరులో గల రోమన్ క్యాథలిక్ మిషన్ ఆధ్వర్యాన స్థానిక చర్చిలో బసవ బుధవారం పురస్కరించుకుని అధిక సంఖ్యలో క్రైస్తవులు హాజరయ్యారు. మాలలను ధరించి 40 రోజుల తపస్సు కాల దీక్షలు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్థానిక ఫాదర్ గోగు పీటర్ ప్రసాద్, ఫాదర్ ఏసుదాసు మాట్లాడుతూ మాలధారణ ధరించిన ప్రతి ఒక్కరూ క్రమశిక్షణ, భక్తిశ్రద్ధలతో క్రీస్తు మార్గం అనుసరించాలని సూచించారు. చెడు అలవాట్లకు దూరంగా ఉండి క్రీస్తు నందు విశ్వాసంతో తపస్సు కాలాన్ని పూర్తి చేయాలని వారు సూచించారు.

రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు పరింపూడి విద్యార్థి

కొయ్యలగూడెం: రాష్ట్రస్థాయి ఇన్‌స్పైర్ పోటీలకు తమ హైస్కూల్‌కు చెందిన విద్యార్థి ఎంపికైనట్లు పరింపూడి బాలికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయిని ఎస్.ఉమాదేవి బుధవారం తెలిపారు. ఏలూరులో జిల్లా స్థాయి పోటీలు నిర్వహించగా, పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థి పెదముత్యం నీల మణికంఠ రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైనట్లు చెప్పారు. ఈ సందర్భంగా విద్యార్థిని ప్రశంసిస్తూ సర్టిఫికెట్ ప్రదానం చేశారని తెలిపారు. త్వరలోనే నీల మణికంఠ రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటుందని చెప్పారు. విద్యార్థి తయారు చేసిన ప్రాజెక్ట్ పాస్కల్ సూత్రం ఆధారంగా పనిచేస్తుందన్నారు. విద్యార్థికి గైడ్ టీచర్‌గా సీహెచ్ ఇందిరా ప్రియదర్శిని సహకరించారని తెలిపారు.

బాలికల సంరక్షణకు కృషి చేయాలి

జంగారెడ్డిగూడెం: బాలికల సంరక్షణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఏపీ స్టేట్ కమిటీ మెంబర్ డాక్టర్ రాజేంద్ర ప్రసాద్ అన్నారు. బుధవారం జంగారెడ్డిగూడెంలో జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. బాలికా సంరక్షణకు ప్రభుత్వాలు అనేక చట్టాలు చేశాయన్నారు. వాటన్నింటినీ అవగాహన చేసుకుని, ప్రత్యేక సమావేశాలు నిర్వహించడం ద్వారా బాలికలను చైతన్య పరచాలన్నారు. ముఖ్యంగా బాల్య వివాహాల వల్ల కలిగే అనర్థాలపై సంబంధిత ఐసీడీఎస్ అధికారులు ప్రత్యేక కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. కార్యక్రమంలో ఏపీ ఫుడ్ కమిషన్ మెంబర్ గంజిమాల దేవి, ఐసీడీఎస్ రీజినల్ ఆర్గనైజర్, వైఎస్సార్ సీపీ జిల్లా మహిళా అధ్యక్షురాలు వందనపు సాయిబాల పద్మ, ఏలూరు డీసీపీవో సూర్యచక్రవేణి, డీఎల్‌డీవో రాజు, జంగారెడ్డిగూడెం, కొయ్యలగూడెం, బుట్టాయగూడెం, కుక్కునూరు ఐసీడీఎస్‌ల సీడీపీవోలు పి.బ్యూల, స్వర్ణకుమారి, ఈ.తులసి, లక్ష్మీ కుమారి, డివిజినల్ ఐసీడీఎస్ సూపర్‌వైజర్లు, గ్రామ సంరక్షణ కార్యదర్శులు, అర్బన్ అంగన్‌వాడీ టీచర్లు పాల్గొన్నారు.

మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలి

కొయ్యలగూడెం: మధ్యంతర భృతిని వెంటనే ప్రకటించాలని కోరుతూ రాష్ట్ర జేఏసీ కమిటీ తరఫున బుధవారం తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు. రాష్ట్రంలో 15 లక్షల మంది ఉద్యోగులు, కార్మికులు, పెన్షనర్లు, కాంట్రాక్ట్, అవుట్ సోర్సింగ్ సిబ్బంది పూర్తి సమయం విధులు నిర్వహిస్తున్నారని, అయితే వీరికి గతంలో ఇచ్చిన హామీలు అమలు కాలేదని నాయకులు తెలిపారు. నల్లబ్యాడ్జీలు ధరించి నిరసన వ్యక్తం చేశారు. ఏపీ ఎన్జీవో కొయ్యలగూడెం యూనిట్ అధ్యక్షుడు పి.శ్రీనివాస్, కార్యదర్శి కాకరపర్తి స్వామి, అసోసియేట్ ప్రెసిడెంట్ అడపా రాంబాబు, కొయ్యలగూడెం ప్రెసిడెంట్ కె.రాంబాబు, సెక్రటరీ ఎస్.రమేష్ బాబు, ఏపీటీఎఫ్ ప్రెసిడెంట్ ఎం.వరకుమార్, బీపీ అబ్బులు, ఈశ్వరరావు, సచివాలయ, రెవెన్యూ సిబ్బంది, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

చింతాలమ్మ విగ్రహ ప్రతిష్ఠ

కొయ్యలగూడెం: గంగన్నగూడెం గ్రామ దేవత శ్రీ చింతాలమ్మ అమ్మవారి నూతన ఆలయ ప్రారంభోత్సవం, విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం బుధవారం వైభవంగా నిర్వహించారు. అమ్మవారికి విశేష పూజలు చేశారు. పుట్టినింటి, మెట్టినింటి కుటుంబీకులతో శాస్త్రోక్తంగా సాంప్రదాయ పూజలు నిర్వహించి మధ్యాహ్నం నుంచి ఆఖండ అన్నసమారాధన చేపట్టారు. మహిళా భక్తులు దేవతాపారాయణాది కార్యక్రమాలు నిర్వహించారు. ఆకుల రామచంద్రం, విజయలక్ష్మి దంపతులు అమ్మవారి విగ్రహాన్ని ప్రతిష్ఠించారు.

పత్రికా ప్రకటన

[illegible]

సం/- యన్.డి.బి.ఎల్.ఆదారి

జంగారెడ్డిగూడెం

ది 13.02.2024